



"శశీ! యీరోజు యెందుకో తల భారంగా వున్నట్టుంది. తలనొప్పి అని గట్టిగా చెప్పలేను. ఎందుకై వుండొచ్చనుకుంటావ్?"

"తలనొప్పి గాకుండా తల భారంగా వుండడమేమిటండీ?"

"అవును. తలంతా అదోమాదిరిగా దిమ్మగా వుంది. తలనొప్పి బాధ యిలా వుండదు! ఇదేమిటో నా కర్థంగావడం లేదు."

'విచిత్రంగా వుందే!"

"ఇవాళే గాదు. నిన్న కూడా యిలాగే వుంటే, నేనంతగా పట్టించుకోలేదు. మధ్యాహ్నం కాఫీ తాగాక అనుకుంటాను దానంతటదే శాంతించింది. మళ్లీ యీరోజు అదేమాదిరి బాధ తయారుకాబట్టే నీతో చెబుతున్నా."

"వో! అలా చెప్పండి. నాకర్థంఐంది మీ వ్యాధి."

'వేళాకోళం కాదు శశీ! తల బాధగా వుంది!"

"అబ్బే! నేను నిజంగానే చెబుతున్నాను. మీ బాధకు చికిత్స నాకు తెలుసు. ఈరోజుల్లో మీకేగాదు. చాలామందికి యీ బాధ తరుచు కలుగుతూంటుంది."

"చంపక అదేమిటో చెప్పు!"

"చెప్పనా? తలనొప్పి పోగొట్టే చికిత్స చెబితే బహుమానం?"

"సాయంత్రం సినిమాకు ప్రయాణం! ఇక చెప్పు, శశీ, నీ చికిత్సేమిటో!"

"పంచదార కరువైన యీరోజుల్లో దక్షిణ దేశంలో చాలాచోట్ల యీ జబ్బు వ్యాపించిందటండీ!"

"నీ అల్లరితనం మానవుగాదు శశీ! త్వరగా చెప్పకపోతే సినిమా ప్రోగ్రాంసున్న-"

"ఆఁ ఆఁ! ఆగండి. చెబుతాను- మీబోటి కాఫీదాసులకి పంచదార కరువై కాఫీ లేకపోవడంవల్ల యీ గొడవ వస్తోంది. బెల్లం కాఫీ మాస్తూచూస్తూ తాగలేరు. తాగితే అనారోగ్యం! అందుకని కాఫీమానేసి, కాఫీనే కలవరిస్తూ, తల దిమ్ములు, నీరసత్వం, తెచ్చిపెట్టుకుంటారు."

"అయితే కాఫీ తాగనందువల్లే నాకీ తల బాధ వచ్చిందంటావ్?"

"నిస్సందేహంగా! వుదయం పూట కాఫీ మానేశారు గాబట్టి యీ గొడవ! మధ్యాహ్నం రాదెందుకంటే ఆఫీసు దగ్గర హోటల్లో తాగుతున్నారు గనక!"

"శహబాష్! మంచి వైద్యురాలివే! నీకు పి. హెచ్. డి. డిగ్రీ యివ్వాల్సిందే! వెంటనే నువ్వు సూచించిన చికిత్స చేస్తాను!"

"ఈ హుషార్లో మీ వాగ్దానం మరిచిపోకండి!"

పి. శ్రీనివాసరావు

"నేను అడి తప్పేవాణ్ణి గాదు శశీ!" అంటూ చొక్కాలో డబ్బులు వేసుకుని కాఫీ హోటల్ కని బయల్దేరాడు. కాఫీ తాగడంవల్ల తన బాధ నివారణ అవుతుందనే నమ్మకం చొప్పున అతడిలో కొంత వుత్సాహం కలిగింది. వుత్సాహం మూలాన కొంతభాగం బాధ తగ్గినట్టే అనిపించింది అతనికి- హోటల్ బోర్డులు పరికిస్తూ నడుస్తున్నాడు మధ్యమధ్య "ఈ హోటల్లో బెల్లంకాఫీ!", "యీ హోటల్ వాడు పంచదార కాఫీ యిస్తాడని నమ్మకం లేదు." అని గొణుగుతున్నాడు- పంచదార కాఫీ అని చెప్పి సాకరిన్ కాఫీ యిస్తే, అది ఆరోగ్యానికి హానికరమని విన్నాడు. అందుకేనట, ప్రభుత్వం సాకరిన్ అమ్మకం పైన ఆంక్ష విధించడం! ఐనా హోటల్ వాళ్లు మోసం చేస్తూనేవున్నారాయె! అని అనుకుంటుండగానే "మాది పంచదారకాఫీ" అనే బోర్డు వొకటి కనిపించింది మహీధరరావుకి- వెంటనే అతనికి "మాదీ స్వతంత్రజాతి" అనే పాట గుర్తొచ్చింది. ఎంత ధీమాగా, యెలుగెత్తి చాటుతున్నారని నవ్వుకున్నాడు. వెంటనే ప్రభుత్వాన్ని విమర్శించాడు తనలోతాను! ఇంత బహిరంగంగా "మాదీ పంచదార కాఫీ" అని చాటుకునేవాళ్ళకు, యీ పంచదార కరువు రోజుల్లో యెన్నోవేల కాఫీ గతప్రాణులకు కాఫీ సరఫరా చేయగలంత పంచదార యెలా దొరికిందో విచారించకూడదూ? విచారించి, అలా దొంగచాటుగా కొన్నందుకు, వాళ్లకు దొంగచాటుగా అమ్మినవాణ్ణి, శిక్షించకూడదూ? అదీ అతని సందేహం-అయినా యిప్పుడా సందేహాల కేమొచ్చిందిలే, అని లోపలికెళ్ళి, అమృతం అనుకొని-ఆ కాఫీ తాగి, సంతోషంతో రొమ్ములు విరుచుకుంటూ బయటపడ్డాడు. నిజంగా శశి చాలా చురుకైనదని నమ్మకం అతనికప్పుడు బలపడింది. ఎంత చులగ్గా తన బాధ లక్షణం కనిపెట్టి చికిత్స సూచించింది! యిప్పుడిప్పుడు తలనొప్పి తగ్గుతున్నదనికూడా అనుకోసాగాడు. అయితే ఆబాధ కాఫీ తాగడంవల్లనే తగ్గిందో, లేక కాఫీ తాగడం మానివేశాక అలాంటి బాధ కలిగిందనీ, కాఫీ పడ్డంతో ఆ బాధ నివారణ అయిందనే మానసిక భావన వల్లనే తగ్గిందో, తెలియదు.

సాయంత్రం సినిమాకి వెళ్దామనే వుద్దేశంతో మహీధరరావు త్వరగా ఆఫీసునుంచి జారుకున్నాడు. ఇల్లు చేరుతూనే శశి చిరునవ్వుతో యెదురైంది. సినిమా సంబర మనుకున్నా డతను.

"యేమండీ! మన వీధిలో గోపాలరావుగారింట్లో పంచదారకు చీట్లు యిస్తున్నారట, యీ వార్డు వాళ్లకు! ఆచీటి పట్టుకుని రేపు కో-ఆపరేటివ్-స్టోర్స్ కెళితే అరవీశ పంచదారా యిస్తారట!"

"నీతో యెవరన్నారు?"

'యెవ రనడ మేమిటి ఒకవేపున యిస్తుంటే! సినిమా సంగతి ఆనక చూసుకుందాంగాని వెళ్ళి చీటీ పట్టుకురండి- పాపడి పాలల్లోకి పంచదార లేదు."

"కాస్తయినా లేదూ?"

"లేదండీ! యెంతకని యిరుగుపొరుగు వాళ్లను దేవిరించనూ? మనకు లేకపోయినా యేదో విధంగా సర్దుకు పోతాంగాని, చిన్న పిల్లల విషయంలో యెలాగండీ! యిదంతా మన ప్రభుత్వ ప్రసాదం!"

"సరేలే! నీ కిదో సాకు చిక్కింది కాంగ్రెసు వాళ్లను దుయ్యపట్టడానికి! కీర్తి శేషులైన జస్టిస్ పార్టీకి చెందినవాడేగా మీ నాన్న! తండ్రి చాలు-"

"పోనిద్దురూ! సరదాగా అన్నదానికింత రోష పడ్తారేం? ముందు ఆచీటీ తీసుకురండి!"

"నువ్వు పట్టుపడితే వదలవే శశీ! నేను యిక్కడే వున్నట్టు వెళ్లొస్తాగానీ, యీలోగా సినిమాకి సిద్ధంగా వుండు!"

"సరే! ఆలస్యం చేయకండీ!"

* * *

లంకాదహనం చేసిన హనుమంతుడి లాంగూలం కూడా అంత పొడుగ్గా అన్ని వంకలు తిరిగివుండదేమో! ఆ క్యూకి మొదలెక్కడో అంతమెక్కడో తెలీడం లేదు. అంతా పంచదార వేటగాళ్లు! అభేద్యమైన కోటకు ముట్టడి వేసినట్టుగా వుంది. ఆక్యూని చూస్తువుంటే! త్వరత్వరగా మనుషులుకూడా తరగడం లేదు. పంచదార యిచ్చేవాళ్లు లోలోపల యెన్ని కావకా

ర్థాలు వెదుకుతున్నారో! అప్పుడే విందారగించిన కొండచిలువైనా ఆ క్యూకంటే వేగంగా కదలగలదేమో! క్యూలో నించున్న జనం ఘోష ముందు సముద్రం హోరు యే మాత్రం! ప్రతివాడికీ తొందరేనాయె! అందరితో పాటు మహీధరరావు వున్నాడు క్యూలో. షాపుకి చాలా దూరంలో కాసేపు పంచదారమీద చర్చ, కాసేపు రాజకీయాలు, తర్వాత తమ అవస్థ గురించి బాధ! మహీధరరావుకి ఒకవేపు ఆకలి బాధ, రెండోవేపు కాళ్ళ తీపులు, మరింకోవేపు ఆఫీసుకి వేళవుతుందే అనే ఆందోళన! టైం చూస్తే శీఘ్రంగా కదిలిపోతోంది - నిల్చుని, నిల్చుని, ప్రాణం విసుగెత్తిం దతనికి-అయినా తప్పదు. అదీ చాలదన్నట్టు వెనక ముందున్న వాళ్ళ చేత డొక్కల్లో పోట్లు! తనలాగే ఆ ప్రయాస భరించలేనివాళ్లు ప్రభుత్వాన్ని, స్టోర్స్ వాళ్ళనీ, మనసారా దీవిస్తున్నారు. "పంచదార లేకపోతే పోయె యీ బాధ వద్దురా భగవంతుడా!" అనికొందరు యిళ్లకు దోవతీశారు కూడాను. మహీధరరావుకి కూడా వాళ్లననుసరించాలని పించినా, యింట్లో పాపాయిసంగతి గుర్తుకొచ్చి, యెంతో ఓర్పుతో నిల్చున్నాడు. యిక తనముందు నలుగురైదుగురి కంటే యెక్కువలేరు. టైం చూస్తే తొమ్మిదిన్నర దాటింది! ఆఫీసుకాలస్యమైతే యెట్లా? ఏమైనా సరే పంచదార సాధించాలి. వెళ్లాడు. మహీధరరావు కౌంటర్ దగ్గరకెళ్లేసరికి పిడుగులా వార్త! వాడినాలుక పీకెయ్యా! అప్పుడేరావాలీ ఆ వుపద్రవం? 'పంచదార అయిపోయింది!' మహీధరరావుకి గుండెలాగిపోయినంత పనైంది. ఇంత ప్రయాసకు ఫలితం అదా? అంతసేపూ మరిచిపోయిన ఆకలీ, కాళ్ల తీపులూ, ఆఫీసుకి ఆలస్యమవుతోందనే భయం అన్నీ కలిసి అతణ్ణి వుగ్రుణ్ణి చేసివేశాయి. ఛెడామడా తిట్టాడు వాళ్లని. గుమస్తా నివ్వెరపోయాడు కొన్ని క్షణాలపాటు. ఆ చీవాట్లు భరించలేక అతనూ నోరు చేసుకున్నాడు. మహీధరరావు అప్పటికి శాంతించి, చుట్టుప్రక్కలవాళ్లు సర్దాక, పొంగి వచ్చే దుఃఖాన్ని అణచుకుంటూ కాఫీహోటలు కెళ్ళాడు. తను యేం తింటున్నాడో తనకే తెలియదు. అతని మనసంతా పాపాయికి కలిగే యిబ్బంది మీదనే లగ్నమైవుంది. పరధ్యానంగా బిల్లుచెల్లించి ఆఫీసువేపు నడిచాడు చకచకా. సంతకం పెట్టబోయే సరికి అధికారికళ్ళు తనని తీవ్రంగా చూశాయి. చూశాడు తన చేతి గడియారాన్ని. పదిన్నర! తను అరగంట లేటయాడు! అధికారి యేవో కేకలేశాడు. తనకవి వినబడలేదు. మౌనంగా తలవంచుకుని నిల్చున్నాడు. "వూఁ! యిక నీ సీటులోకి వెళ్ళి పనిచెయ్!" అని అతను గద్దించేసరికి మహీధరరావు స్మారకంలోకి వచ్చి, తన సీటువద్దకెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. పని చేద్దామంటే మనస్కరించదాయె! వికలమై వుంది అతడి మనసు. ఐనా చాకిరీ తప్పదుగాబట్టి. ఫైల్సురాయడం సాగించాడు. మనసు మనసులో లేకపోతే యేం రాస్తాడు? యేదో రాస్తున్నాడు. అదేమిటో అతనికే తెలియదు. రాసినవి పై ఉద్యోగి సంతకానికి వెళ్తున్నాయి. తిరిగి వస్తున్నాయి.

అతడి భావాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుస్తున్నాయి- "యిదంతా మన ప్రభుత్వం ప్రసాదం!" అంది కదా శశి? నిజమే! ఆవిడ మాటలు తనకిప్పుడు యథార్థంగానే వున్నట్టు తోస్తున్నయ్. శశి వివేకవంతురాలే! కాంగ్రెసు ప్రభుత్వం యీ పంచదార విషయంలో తప్పటడుగు వేసినట్టున్నది-అందుకే పంచదారగురించి చర్చ సమయాన పార్లమెంటు సభ్యులు ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆచార్య కృపాలినీ అంతటివాడు "యీ విషయంలో ప్రభుత్వం రాజీనామా యిచ్చినా నేనందుకు చింతించను" అన్నాడంటేపూరికనే అనివుండడు. ఆయన కమ్యూనిస్టు కాడుగా! ప్రభుత్వం పొరపాటే చేసి వుండాలి, లేకుంటే దేశమంతటా ఈ యిబ్బందేమిటి, యెన్నడూ లేంది? అవును, కాంగ్రెసు రాజ్యాన్ని యీ విషయంలో ఖండించవలసిందే!

పై ఉద్యోగి పిలిచాడు. ఫైల్సులో చాలా అవకతవక లున్నాయని మందలించే సరికి మహీధరరావు చిన్నబోయాడు. తనని సమర్థించుకునేందుకు "పొరపాట్లు మనిషన్నాక చేయకుంటాడా సార్!" అన్నాడు. దాంతో ఆ వుద్యోగికి వొళ్లు మండింది.

"పొరపాట్లేమిటయ్యా! పొరకటం కాదా? యింతంతేసి మిస్టేక్స్ చేసి పైగాను! ఆఫీసర్ వీటిని చూస్తే యింకేమన్నా వుందా? చాల్చాలు, మనసు నిలిపి పనిచెయ్!"

మహీధరరావు మరి మాట్లాడలేదు. అవన్నీ పుచ్చుకుని, తన కర్మని నిందిస్తూ, వచ్చి కుర్చీలో కూలబడ్డాడు—ఆకలి! పంచదార లేదు! కాళ్ళ తీపులు! చీవాట్లు!

* * *

"ఏమండీ హృదయం భోజనానికి రాలేదేం?" అతనింట్లోకి అడుగుపెడ్తూండగానే శశి అడిగింది. మహీధరరావు వెంటనే జవాబు చెప్పలేక నీళ్లు నమిలాడు. కానీ—కనకోసం యెదురు చూసి వుండాలి, పంచదార తెస్తానని ఆశతో! పాపం తను లేచిన వేళావిశేషం మంచిదిగాదేమో!

"మాట్లాడరేం? యెక్కడ భోంచేశారు?"

"పంచదారకోసం కాళ్లు విరిగేదాకా నిల్చుని, నిల్చుని, టైము అయిపోవడంచేత హోటల్లో భోంచేశాను!" మహీధరరావు వెనకాడకుండా అబద్ధం చెప్పేశాడు. తను భోజనం చేయలేదని చెప్పి శశి మనసు వ్యాకులపరచ దలచుకోలేదు. పంచదార లేమికితోడు, తను భోజనం చేయలేదని బాధకూడా ఆవిడకెందుకు కలగజెయ్యాలి?

"అయితే పంచదార దొరకలేదా?"

"ఏం పంచదార! వాళ్లను తగలెయ్యా! అంతసేపూ నిలుచోబెట్టి, తీరా అయిపోయిందన్నారు. వాళ్ళను ఆపళంగా నరికేయాలనిపించింది. ప్రభుత్వం చలవ!" ఆవేశంతో అన్నాడు మహీధరరావు.

"అయ్యో! పంచదార తెస్తారుగదా అని, రేపు పండక్కి వెచ్చాలు తెప్పించాను పిండి వంటలకోసం!"

"వెచ్చాలు తెప్పించావా! పిల్లందరి దయవల్లా మనకు పండగలు, పబ్బాలూ కూడానా?" అంటూ మహీధరరావు కుర్చీలో కూలబడ్డాడు.

"పోనీ పండగ లేకపోతే పోయె! ఇంట్లో పిల్లాడి పాలకోసం పంచదార కరువైందే! ఇదెక్కడి న్యాయమండీ?"

శశి కంఠంలో విచారం తొణికిసలాడింది. మహీధరరావు చకితుడయ్యాడు. తన విషయం మరిచిపోయాడు సుమా! పండగ వెగలడిస్తా, పిల్లాడికి ఇబ్బంది వస్తుందే! పండగ అని స్టోర్సు మూసేస్తారాయె! తెరిచివుంటే యేదోవిధంగా కిందామీదా బడి తెచ్చుకోవచ్చు ననుకో!

విఘ్నేశ్వరుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలే అన్నట్టుంది. చుట్టుపక్కలవాళ్లెవరూ యీ సమయంలో పంచదార బదులివ్వరు! యేం చేయాలిభగవాన్!

"పంచదార దొరక్కపోతే ప్రమాదమండీ? యెక్కువ ధరయిచ్చి ఐనా చాటుగా తెచ్చుకోక తప్పదేమో!" అంది శశి జంకుతూ!

మహీధరరావు ప్రాణాలు గతుక్కుమన్నయ్. అమ్మయ్యో! దొంగబజారులో కొనాలా? తన జీవితంలో యెన్నడూ చెయ్యనిపనే! తన సిద్ధాంతాలు, ఆదర్శాలు, మట్టిపాలు కావలసిందే! అతని ఆత్మ అంగీకరించడం లేదు. కానీ కర్తవ్యం "హూఁ! చూస్తావేం?" అని ముందుకు నెట్టుతోంది చీకట్లోకి! అటు బీదవాడుగాక, ఇటు ధనవంతుడూ గాని, మధ్య తరగతి కుటుంబీకుడి గతి అంతేనా? త్రిశంకు స్వర్గమే! తన సిద్ధాంతాలు పరీక్షకి నాడు ఆగలేకపోతున్నయే. పతనం! పతనం!! తప్పదు. తండ్రిగా తన కర్తవ్యం ముఖ్యమైంది. యెలాగైనా బిడ్డ ఆహారంకోసం పంచదార తేవాలి! శశి అతని ముఖకవళికలోని మార్పు గమనిస్తూనే వుంది. ఆవిడ మాత్రం యేం చేస్తుంది? మహీధరరావు లేచాడు.

"చీకటిపడ్డాని కూడాను! యిదే అదను! గోపయ్య యిస్తాడులే! చాటుగా వీశె రెండు రూపాయల కమ్ముతున్నాట్ట!"

శశి మాట్లాడలేదు. మహీధరరావు వెళ్లాడు తలవంచుకుని పరాజిత సైనికుడిలా!

---

భార్య :—మీ మగవాళ్ళకేదైనా చెబితే ఓ చెవులోంచి దూరి యింకో చెవులోంచి పోతుంది. మీరు ఏదీ బొత్తిగా పట్టించుకోరు.

భర్త :—కాని, ఆడవాళ్ళకి చెప్తే, రెండు చెవుల్లోంచీ దూరి నోట్లోంచి బయటికి పోతుంది.